



పంప్‌హౌస్‌పనుల మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

జిల్లాపై ఫెంగల్ ప్రభావం

◆ ముసురుకున్న మబ్బులు ◆ సాయంత్రం నుంచి ఎడతెరపిలేని వర్షం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఫెంగల్ తుఫాను ప్రభావం సోమవారం నాడు జిల్లాలో కనిపించింది. ఉదయం నుంచి మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. తేలికపాటి జల్లులు పడ్డాయి. ఎప్పుడూలేని విధంగా నవంబర్ మాసంలో చోటు చేసుకున్న ఈ వాతావరణ ప్రభావం చూసి రైతుల్లో గుబులు నెలకొంది. ప్రధానంగా వరి పంట నూర్పిడి జరుగుతున్న సమయంలో వర్షాలు పడుతున్నాయి. కొన్ని చోట్ల కళ్లాల్లోనూ ధాన్యం ఆరబోసి ఉన్నారు. కణేకల్, బొమ్మనహాళ్, నార్పల, శింగనమల మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల వరకు సాగైంది. ఈ పంట నూర్పిడి దశలో ఉంది. వర్షసూచన ప్రకటన వెలువడినప్పటి నుంచి రైతుల్లో గుబులు నెలకొంది. పత్తి, కంది పంటలపైనా ప్రభావం చూపనుంది. ఒకటిన్నర లక్షల ఎకరాల్లో కందిపంట సాగు చేశారు. పూత, కాయ దశలో ఉంది. ఈ సమయంలో ఎడతెరపిలేని వర్షాలతో చీడ,పీడలు వ్యాపించే అవకాశముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ సూచించింది.



సోమవారం సాయంత్రం నుంచి ఎడతెరపిలేని వాన

సోమవారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకుని ఉన్నా సాయంత్రం నుంచి ఎడెతరపిలేకుండా చిరుజల్లులు పడుతున్నాయి. జనం బయటకు రావాలంటే జంకే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా అనంతపురం నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ ముసురు కమ్ముకుని ఉంది. వర్షంతోపాటు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. అవసరమైన ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లావాసులకు అధికార యంత్రాంగం హెచ్చరించింది. రాత్రి వరకు కూడా ఇదే రకమైన వర్షాలు పడితే ఏమివుతుందోనని గుబులు అందరిలోనూ ఉంది.

ఈశాన్యంలోనూ అధిక వర్షపాతమే

నైరుతి రుతుపవనాల సమయంలో అధిక వర్షాలు పడ్డాయి. ఈశాన్యంలోనూ అదే పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు సాధారణ వర్షపాతం 129.5 మిల్లీమీటర్లు కురావాల్సి ఉండగా 153.4 మిల్లీమీటర్లు పడ్డాయి. సాధారణం కంటే 18.5 శాతం అధికంగా పడింది. ఇక నైరుతిలో చూస్తే జూన్ నుంచి సెప్టంబర్ వరకు 319.7 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 431.3 మిల్లీమీటర్లు పడింది. అందులో 34.9 శాతం అధికంగా పడింది. మొత్తంగా ఈ సీజన్ ప్రారంభం అంటే జూన్ నుంచి డిశెంబర్ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 449.2 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 584.7మిల్లీమీటర్లు పడింది. అంటే సాధారణం కంటే 30.2 శాతం అధికంగా పడింది.

పంప్‌హౌస్ పనులను ప్రారంభిస్తాం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

త్వరలో టెండర్లను పిలిచి పంపు హౌస్ పనులన్నింటినీ మొదలు పెడతామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. బెలుగుప్ప మండలం కోనాపురం గ్రామం దగ్గర ఉన్న పంపు హౌస్‌ను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హంద్రీనీవా 11వ పంప్ హౌస్ పనులు దాదాపు 5 సంవత్సరాలుగా ఒక్క అడుగు ముందుకు సాగని పరిస్థితి ఉందన్నారు. పంప్ హౌస్ సబ్ స్టేషన్‌కు నిధులు విడుదల చేశామన్నారు. కొత్త ప్రతిపాదనలతో సమయం వృథా చేయకుండా పాత వాటి మేరకే డబ్బులు విడుదల చేశామన్నారు. అదనంగా పెరిగిన తర్వాత ధరలు ఏవైతే ఉన్నాయో వాటిని పరిశీలించి ప్రతిపాదనలు పెట్టేలా సూచనలు చేశామన్నారు. 12వ కిలోమీటర్ల విద్యుత్ లైన్ వేయాలని, ఒక సబ్ స్టేషన్ కట్టాలని, సబ్ స్టేషన్ లో 5 కేవీ ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే మార్కెట్లో ఆరు నెలలు పడుతుందన్నారు. ఇప్పటి నుంచి మొదలు పెడితే ట్రాన్స్‌ఫార్మర్ కూడా వేగంగా వచ్చే పరిస్థితి లేదన్నారు. మూడున్నర కిలోమీటర్లు స్టీల్ పైపులు వేయాల్సి ఉందన్నారు. వీటన్నింటి కోసం సమయం వృథా చేయకుండా పనులు ముందుకు సాగేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లకు ఉన్న సందేహాలను కూడా నివృత్తి చేయనున్నట్లు తెలియజేశారు. పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లను పిలిచి ఈ మొదలు పెడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపులు ఆపాలి : వ్యకాసం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను అధికార పార్టీ నాయకులు బలవంతపు తొలగింపులు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా సమస్యల వేదికలో సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ రోస్టర్ ప్రకారం వారిని యథావిధంగా కొనసాగించాలని కోరారు. గుంతకల్లు మండలం పులగుట్టపల్లి పంచాయతీలో రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని వీటిని నియంత్రించాలని కోరారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఢిల్లీలో కేంద్ర నైపుణ్య అభివద్ధి మంత్రి జయంత్ చౌదరిని సోమవారం కలిశారు. అనంతపురం జిల్లాలో నైపుణ్య అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేయాలని ఆయన్ను కోరారు. నిరుద్యోగులకు నైపుణ్య అభివృద్ధి సంస్థల ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. జిల్లాలో సూర్యరశ్మిని ఉపయోగించుకుని స్వచ్ఛమైన ఇంధన పర్యావరణ వ్యవస్థ ద్వారా విద్యుత్ ఉపయోగించుకునేందుకు కావాల్సిన నైపుణ్య శిక్షణ సంస్థలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఆంధ్ర ప్రదేశ్‌లో శిక్షణ అభివృద్ధి ద్వారా నిరుద్యోగులకు ఎక్కువ శాతం అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు

ప్రజాశక్తి-రాయదుర్గం

కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు(ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించవద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్‌వి.ఆంజనేయులు రాష్ట్ర ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 2006లో జిల్లా స్థాయిలో ఉన్న 3 గ్రామీణ బ్యాంకులను కలిపి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా మార్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో 4 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను కలిపి ఒకే బ్యాంకుగా విలీనం చేయడం మంచిదే అయినా ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించడం తగదన్నారు. ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని కోరారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ కంప్యూటర్ లిటరసీ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం లేనిదే అభివృద్ధి లేదన్నారు. ప్రతి వ్యవస్థలో కార్యకలాపాలు వేగంగా జరగాలి అంటే కంప్యూటర్ లిటరసీ చాలా అవసరమన్నారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలనారు. కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకురాలు ఫరీసా ఫిర్దోస్ మాట్లాడుతూ కంప్యూటర్ విజ్ఞానం అద్భుతాలు సృష్టించగలదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. కంప్యూటర్ జ్ఞానంతో పాటు ఇతర జ్ఞానం కూడా చాలా అవసరమన్నారు. అనంత రం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిపి సిటిఒ కిరణ్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు అమీర్‌హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు దేవదాస్, పాండురంగ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఎదురుగా ఉన్న వెటర్నరీ ట్రైనింగ్ సెంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల నుంచి నిరుపయో గంగా ఉన్న వెటర్నరీ ట్రైనింగ్ సెంటర్‌ను పున:ప్రారంభించి పాడి రైతులకు సేవలు అందిస్తామన్నారు. అంతకుముందుగానే దారి, విద్యుత్, తాగునీరు, తదితర మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు.

ఆర్‌డిటి ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మండలం లోని పాపంపల్లి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారున. ఆర్‌డిటి స్పాన్సర్స్ మాట్లాడుతూ కేవలం చదువుతో మాత్రమే విజ్ఞానం, అభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువు ద్వారా మాత్రమే పేదరికాన్ని నిర్మూలిం చవచ్చు అన్నారు. కావున విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవాల న్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యా యులు, సిబ్బంది పాల్గొన్నారున. ఆర్‌డిటి సంస్థకు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఆర్‌డిటి స్పాన్సర్స్

7న సాయుధ దళాల పతాక దినోత్సవం



సాయుధ దళాల పతాక దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డిసెంబర్ 7న నిర్వహిస్తున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డా॥వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, పోస్టర్స్, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఏ.మాలోల, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్పతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు, దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు విధులను నిర్వర్తిస్తున్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమం కోసం సాయుధ దళాల పతాక నిధికి అన్ని వర్గాల ప్రజలు ఉదారంగా విరాళాలు అందించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఎస్‌బిఐ ఖాతా నెం: 62076956433 ఐఎఫ్ఎస్‌సి కోడ్.. SBIN0021438 కూడా పంపవచ్చాన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రాధాన్యత, సైనిక సంక్షేమ నిధికి విరాళాల సేకరణ అంశాలపై జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులకు వివరించి కరపత్రాలను అందించి, విరాళాల సేకరణకు జిల్లా అధికారుల సహకారాన్ని కోరారు.

పోస్టర్లు, కార్ ఫ్లాగ్స్, స్టిక్కర్లు ఆవిష్కరణ

మహిళలపై హింస లేని అనంతను తయారు చేద్దాం

మహిళలపై జరిగే హింస వ్యతిరేక అంతర్జాతీయ పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌లను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. మహిళలపై హింస లేని అనంతను తయారు చేసేలా అందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మహిళలపై జరిగే హింస వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాలు డిసెంబర్ 10వ తేదీ వరకు జరుగుతాయని వీటిని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో టూరిజం సర్క్యూట్స్‌కు సంబంధించి అనంతపురం క్లస్టర్, తాడిపత్రి క్లస్టర్, కళ్యాణదుర్గం క్లస్టర్లను ఏర్పాటు చేయగా, అందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4, 5 తేదీలలో నిర్వహించే రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ - 2024 పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఉత్తమంగా పనిచేసిన అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఏ.మలోల, డిపిఎం ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కంబదూరు మండలంలోని నూతిమడుగు గ్రామ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బేస్‌బాల్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, తదితర ఆటల్లో ప్రతిభ చాటారు. రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 పోటీలకు 43 మంది ఎంపికయ్యారు. వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆసుపత్రి ఐసిటిసి, రిడ్స్ సంస్థ ఆధ్వర్యం లో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ తెలిపారు. ర్యాలీని తహశీల్దార్ సుమతి, వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఎంపీడీవో నందకిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ సంక్రమణ, లక్షణాలు, జాగ్రత్తలు, నివారణ మందులు, దాని వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆసుపత్రి నుంచి ఎన్‌టిఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఎర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఆఫ్తాబ్, ఎంఇఒ కృష్ణానాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రామాంజనమ్మ, కాశీంబి, హెల్త్ సూపర్వైజర్ రామలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ పవన్‌కుమార్, ఫార్మసీ మహేష్, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించి సకాలంలో పెన్షన్, బకాయి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్ గుంటూరు అధికారిని అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు సబ్‌ట్రెజరీ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాస్థాయిలో అందరూ ఎస్టీవోలు, ఏటీవోలు, పెన్షనర్స్ సంఘాల నాయకులు జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. సిఎఫ్‌ఎం ఎస్, పే స్లిప్, సర్వీస్ స్పెన్సర్స్ పుట్టిన తేదీ తప్పు ఒప్పులు మార్పులు చేర్పులు, ఇన్కమ్ టాక్స్ మినహాయింపు తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ల సంఘం జిల్లా కోశాధికారి రామకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండి ఖలందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షులు మహమ్మద్, నారాయణ, రఘురాం దయాలు, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పోలీసుల 'ఫేస్‌వాష్ అండ్ గో'

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున గార్లదిన్నె మండలం కల్లూరు జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి-44 పై వెళ్తున్న లారీలు, బస్సులు, కార్లు, మినీవ్యాన్లు, లగేజీ బొలేరోలను ఆపి డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపించారు. ముఖం కడిగాక టీ తాగమని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని డ్రైవర్లకు గుర్తు చేశారు. వాహనాల డ్రైవర్లు నిద్ర మత్తులోకి జారకుండా పూర్తిగా తేరుకుంటే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చనే సంకల్పంతో ఈకార్యక్రమం చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.



జాతీయ రహదారిపై వేకువజామున డ్రైవర్‌కు మొహాన్ని కడిగిస్తున్న పోలీసులు

జిల్లాలో ముమ్మరంగా వాహన తనిఖీలు

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం తెల్లవారుజామున నుంచి జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులతోపాటు జిల్లా, గ్రామీణ రహదారులపై వెళ్లిన ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, అక్రమ మద్యం, ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణ, గంజాయి, తదితర మత్తు పదార్థాలు అక్రమంగా తరలించకుండా వాహనాల తనిఖీలు కొనసాగాయి.



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందిచే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కొనసాగింది. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఎ.మలోల, ఎస్డీసీ శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితర జిల్లా శాఖ అధికారులతో కలిసి 380 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను గడువులోగా తక్షణం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడంలో కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్, జెడ్పీ సిఇఒ వెంకటసుబ్బయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్యతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని బసవేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్న టెలికాం రిటైర్డ్ ఉద్యోగి ప్రసాద్ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉంచిన బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దేవినేని ధర్మతేజను కలిసిన బుడిమేపల్లి టిడిపి నాయకులు

ప్రజాశక్తి- బ్రహ్మసముద్రం

మండలంలోని బుడిమేపల్లి టిడిపి సీనియర్ నాయకులు, కన్నేపల్లి మాజీ వైస్ సర్పంచి ఈజె. సురేష్ సోమవారం కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు దేవినేని ధర్మతేజను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. సాగునీటి సంఘం ఎన్నికలు, బిటిపి, గ్రామాభివృద్ధి, పార్టీ బలోపేతం, విద్య, వైద్యం, రోడ్లు, మౌలిక సదుపాయాలు, తదితర అంశాలపై వారు చర్చించారు. అన్ని సమస్యలను సాధ్యమైనంత వరకూ పరిష్కరిస్తానని ధర్మతేజ హామీ ఇచ్చినట్లు సురేష్ తెలిపారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాలబండ్ల సురేంద్ర, చాకలి ఎర్రిస్వామి, 12 వార్డ్ మెంబర్ గాజుల ఆంజనేయులు, 13వార్డ్ మెంబర్ వెంకటేష్, చాకలి మల్లికార్జున, అభిలాష్, ఇరగం మోహన్, ఉప్పర రాఘవేంద్ర, జనసేన కార్యకర్త కెటి.తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.



దేవినేని ధర్మతేజను కలిసిన బుడిమేపల్లి నాయకులు

నాణ్యత లేని తినుబండారాలు విక్రయిస్తే చర్యలు

ఎస్పీ పి.జగదీష్


తినుబండారాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పాఠశాలల వద్ద నాణ్యత లేని తినుబండారాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని పాతూరులోని గాంధీబజార్, తాడిపత్రి బస్టాండ్, తదితర ప్రాంతాల్లో పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. స్కూళ్ల వద్ద నాణ్యతలేని తినుబండారాలు విక్రయిస్తున్నట్లు ఎస్పీకి ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు అధికంగా తినే కుర్‌కురే, తదితర పాకెట్లను పరిశీలించారు. పాఠశాలల వద్ద వ్యాపారులు చిన్నారులకు విక్రయించే తినుబండారాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లీమా, సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

శివారు కాలనీలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతల వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ శివారులోని భీమిరెడ్డి నగర్, గుజిరీ, వినాయక కాలనీలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం రైల్వే స్థలాల్లో నివాసం ఉంటున్న దళితుల ఇళ్లను ఖాళీ చేయించి, అప్పటి ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆర్డీటీ సహకారంతో సుమారుగా 600 ఇళ్లను నిర్మించిందన్నారు. కాలనీ నుంచి ప్రజలు గుత్తి రోడ్డుకు చేరుకోవాలంటే రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రక్షణ సమితి అధ్యక్షులు ఎం.మహేంద్ర, ప్రధాన కార్యదర్శి కోరి చంద్రశేఖర్, రైతు కూలీసంఘం డివిజన్ అధ్యక్షులు రామాంజనేయులు, నేషనల్ ఉమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు షేక్ ఆలం నవాజ్, నాయకులు శ్రీనివాసులు, ఎర్రిస్వామి, సంపత్‌కుమార్, రామచంద్ర, మస్తాన్, కిష్టప్ప, కొమ్ము రామాంజనేయులు, ఏసన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి ఆర్‌ఎస్‌లోని 7వ వార్డులో ఉన్న ఎస్సీ కాలనీలో విద్యుత్ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ డి.ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మందల నాగరాజు మాట్లాడుతూ 40ఏళ్ల క్రితం ఎస్సీ కాలనీలో ఎపిఎస్‌డిసిఎల్ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం కాలనీలో నివాసాలు పెరిగిపోయాయని వాటికి తగ్గ విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. కాలనీలో సక్రమంగా విద్యుత్ సరఫరా కావటం లేదన్నారు. వోల్టేజ్ తో ఇళ్లల్లోని ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతనంగా మరొక విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎపిఎస్‌డిసిఎల్ ఎడిఇ జి.సాయి శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, టి.సుధాకర్, పి.నాగరాజు, రంగడు, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకు పూర్వ విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి -అనంతపురం


చెక్కులు అందజేస్తున్న పూర్వ విద్యార్థి శ్రీరామచంద్ర

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో 1970లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి సర్వా శ్రీరామచంద్ర ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు రూ.2లక్షల చెక్కును ఉపకులపతికి సోమవారం అందించారు. అలాగే కొప్పర్తి విజయభాస్కర్ రూ.3 లక్షలు చెక్కును శ్రీరామచంద్రమూర్తి దంపతుల ద్వారా ఉపకులపతి హెచ్.సుదర్శనరావు సమక్షంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఫారెన్ అఫైర్స్, ఆలూమినీ డైరెక్టర్ పి.సుజాత, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలపై అలసత్వం వద్దు..

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెలే మాట్లాడుతూ ప్రతి ఒక్క వినతిపత్రంపై అధికారులు జవాబుదారిగా ఉండాలన్నారు. ముఖ్యంగా భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాగా మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం చర్యలు చేపట్టకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై రోడ్లు, వీధిదీపాలు, పింఛన్లు, తాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజా, ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, సిఐ సత్యబాబు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కూలీలకు 'ఉపాధి' కల్పించాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించి వలసలను ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారం వేదికలో తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం లేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ ద్వారా ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కల్లుమడి, సలకంచెరువు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో విద్యుత్తు లైన్లు కింద వేలాడుతున్నాయన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. వీటితోపాటు రాచేపల్లి వద్ద ఉన్న చెప్పుల పరిశ్రమను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. నిదనవాడ ఎస్సీ కాలనీవాసులకు శ్మశాన స్థలం కేటాయించాలని, కల్లుమడి-గుమ్మేపల్లి రోడ్డుకు మరమ్మతులు చేయాలని, కల్లుమడి-శింగనమల రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీనివాసులు, వెంకట్‌రాముడు, సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పారిశుధ్య విభాగంగాలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన కార్మిక కుటుంబాలకు రెండేళ్లు అవుతున్నా ఉపాధి కల్పించలేదన్నారు. వెంటనే మృతుని కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, పెరిగిన జనాభాకు తగ్గట్టుగా 200 మంది కార్మికులను నియమించాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న సరెండర్ లీవు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు 1వ పట్టణ కార్యదర్శి వెంకట్‌నారాయణ, అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేశు, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీదేవి, నాగేంద్ర, రాఘవ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కళాశాలలను సీజ్ చేయాలి

ఆర్‌ఐఒకు ఎస్‌ఎఫ్‌ఐ నేతల వినతి


ఆర్‌ఐఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే అడ్మిషన్ల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తూ ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న కళాశాలలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధు, ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో కార్యాలయంలో ఆర్ఐఒ వెంకటరమణనాయక్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్స్ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మాఫియా నివారించాలన్నారు. ముఖ్యంగా నగరంలోని విశ్వంభర కళాశాలలో ఇంటర్ అడ్మిషన్స్ కోసం డిసెంబర్ 8న ప్రవేశ పరీక్షలు నిర్వహించేందుకు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే నారాయణ, చైతన్య విద్యాసంస్థల్లో కూడా ముందస్తుగా నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి చర్యలకు పాల్పడం వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వెంటనే ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు.

కెజిబివిల్లో ఖాళీలు భర్తీ చేయాలి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కెజిబివి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని దాదాపు 62పాఠశాలల్లో అనేక పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. వెంటనే ఆయా పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

చిన్నారులతో ఎస్పీ మమేకం


పిల్లలలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

గతనెలలో నిర్వహించిన బాలల దినోత్సవం విజయవంతం కావడపై ఎస్పీ పి.జగదీష్ సోమవారం పిల్లలను కలిశారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి పిల్లలను పిలిపించుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా పిల్లలకు గులాబీలు అందజేసి ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీ తన హోదాను మరిచి పిల్లలకు చాక్లేట్లు పంచుతూ ఆనందంగా గడిపారు. దీంతో చిన్నారుల ఆనందనానికి అవధుల్లేకుండా పోయాయి.

ఫసల్‌బీమా పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-బెలుగుప్ప

కళ్యాణదుర్గంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ వసంతబాబు మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం వాతావరణ బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులు ప్రీమియం చెల్లించుకుంటే బీమాకు అర్హులు అవుతారన్నారు. కావున రైతులు ఈనెల 15వతేదీలోపు మీ పరిధిలోని కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయాల్లో 1బి, ఆధార్, పంట ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లి బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కర్, కళ్యాణదుర్గం ఎడిఎ యల్లప్ప, ఉద్యానవన అధికారి కృష్ణతేజ, అగ్రికల్చర్ బీమా కంపెనీ మండల కోఆర్డినేటర్లు నబిరసూల్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-యాడికి

సూఫీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరామ్ కంటి ఆసుపత్రి వారు సోమవారం మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ దగ్గర ఉన్న అమీనా ఆప్టికల్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్య నిపుణులు చిరంజీవి దాదాపు వందమందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అమీనా ఆప్టికల్స్ యజమాని సయ్యద్, సూఫీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

నంది అవార్డు అందుకున్న భార్గవనాయుడు

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని చందన గ్రామానికి చెందిన గుంజలపాడు నాగేంద్ర నాగలక్ష్మి దంపతుల కుమారుడు భార్గవనాయుడు ఆదివారం నంది అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ వేదికలో విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన భారతీయ నాట్య కళా వైభవంలో గుత్తికి చెందిన ఆర్ఆర్ డాన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని పుష్ప-2 సినిమా పాటకు చేసిన డాన్స్ ప్రదర్శనలో నంది అవార్డు అందుకున్నట్లు డాన్స్ మాస్టర్ రవి తెలిపారు. ఈ సందర్భంగా భార్గవనాయుడు తల్లిదండ్రులు మాట్లాడుతూ రోజూ చందన గ్రామం నుంచి గుత్తికి వెళ్లి డ్యాన్స్ ప్రాక్టీస్ చెపించే వాళ్లమన్నారు. తమ శ్రమకి ప్రతిఫలం దక్కిందన్నారు. చిన్న గ్రామం నుంచి హైదరాబాద్ వరకూ వెళ్లి తన కుటుంబం, ఊరికి పేరు తెచ్చినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ నృత్య ప్రదర్శణలో భార్గవ్‌నాయుడుతో కలిసి రితిక, భార్గవ్, షర్వానంద్, కార్తీక్, జగదీష్, రాహుల్ పాల్గొన్నారు.

రోడ్డుపై నీరు వదిలితే చర్యలు

ప్రజాశక్తి-పుట్లూరు

రోడ్డుపై నీరు వదిలితే చర్యలు తప్పవని ఎస్ఐ హేమాద్రి, పంచాయతీ సెక్రటరీ వెంకటనాయుడు హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని బాలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా కొంతమంది రోడ్లపై నీరు వదలాన్ని గమణించి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్డుపై నీరు వదిలితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకొకసారి వీధులను అపరిశుభ్రం చేస్తే లోక్ అదాలత్‌లో కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆర్‌డిటి ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. వస్తే ఎలాంటి చికిత్స తీసుకోవాలనే విషయాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలప్ప, ఆర్డీటీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సిసి తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటి సంవత్సరం ఎన్‌సిసి తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం పత్రా శ్రీనివాసులు, షఫీ, మాజీ ఆర్మీ అధికారి లక్ష్మీనారాయణ, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ హరిత, ఎన్‌సిసి అధికారి వై.రామాంజనేయులు, ఉపాధ్యాయులు యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ టిడిపి శాశ్వత సభ్యత్వం స్వీకరణ

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రూ.లక్ష ఆన్‌లైన్ ద్వారా చెల్లించి టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.

చెత్తకుప్పను తరలించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల పక్కనే డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తకుప్పను తరలించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పాఠశాల పక్కనే ఉన్న చెత్తకుప్పను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉరవకొండలో 9,220 నివాస గహాలు ఉన్నాయన్నారు. వారందరూ ఇంటికి రూ.50 చొప్పున పన్ను చెల్లిస్తున్నారన్నారు. అయినా పారిశుధ్యం చర్యలు చేపట్టడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి పాఠశాల పక్కనే ఉన్న చెత్తకుప్పను తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుడిసెల రాజేష్, మల్లికార్జున, రమేష్, మణికుమార్, బోగేష్, వంశీ, జయకుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి : విసి

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని హిస్టరీ, సోషియాలజీ, సోషల్ వర్క్, తదితర విభాగాలను ఉపకులపతి బి.అనిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు, బోధన సిబ్బందికి సంబంధించిన రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది సయమపాలన పాటించాలన్నారు.

పింఛన్ల పంపిణీలో తాడిపత్రి ఫస్ట్

ప్రజాశక్తి-తాడిపత్రి

పింఛన్ల పంపిణీలో తాడిపత్రి మున్సిపాలిటీ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. మునిసిపాలిటీలో 9,750 మంది పింఛన్‌దారుల్లో 9,673 మందికి పింఛన్లు మంజూరు చేసి 99.27 శాతంతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో సోమవారం అనంతపురంలోని కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో తాడిపత్రి కమిషనర్ సబ్బి శివరామకృష్ణను కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. పింఛన్ పంపిణీలో మొదటిస్థానంలో నిలిచేందుకు సహకరించిన ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, సచివాలయాల సిబ్బందికి కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

అమిదాలగొంది ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్ తగదు

ప్రజాశక్తి-అనంతపురం

మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం తగదని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చేతన్‌ను గతనెల 28న విరామ సమయంలో స్వయానా అబ్బాయి మేనమామ వచ్చి తీసుకెళ్ల హత్య చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. అయితే ఈ విషయంలో ఎలాంటి సంబంధం లేని ప్రధానోపాధ్యాయుడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం సమంజసమన్నారు. పాఠశాల విరామ సమయంలో విద్యార్థి మేనమామ వచ్చి అతని ఇష్టపూర్వకంగా తీసుకెళ్తే ఉపాధ్యాయులు ఎలా బాధ్యులు అవుతారని ప్రశ్నించారు. వెంటనే ఆమిదాలగొంది ప్రధానోపాధ్యాయులు జబేజ్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. అలాగే పిఇటి ప్రసూనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును కూడా ఉపసంహరించాలని కోరారు.

రైతుల కళ్లల్లో ఆనందమే లక్ష్యం

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి-ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రైతుల కళ్లల్లో ఆనందం చూడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముచ్చుకోట రిజర్వాయర్‌కు హెచ్చెల్సీ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతోనే హెచ్‌ఎసిహెచ్ హెచ్‌ఎల్సీ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ముచ్చుకోట రిజర్వాయర్‌కు నీరు వస్తే ముచ్చుకోటతోపాటు అమలదిన్నె, వరదాయపల్లి, తదితర గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. అంతేగాకుండా రైతులు పంటలు పండించి సుభిక్షంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చుకోట యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ రఘుప్రతాప్‌రెడ్డి, ఎంపిడిఒ శకుంతలమ్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గార్లదిన్నె

తుపాను ప్రభావం వల్ల వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 4,305 ఎకరాల్లో వరిపంట సాగు చేయగా 1,663 ఎకరాల్లో పంట కోత జరిగిందన్నారు. కావున రైతులు పంటను వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పొలాల్లో డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పాముకాటుకు గురైన మహిళ మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని తిప్పయ్యదొడ్డి గ్రామంలో పాముకాటుకు గురైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. తిప్పయ్య దొడ్డి గ్రామానికి చెందిన గొల్ల మల్లికార్జున భార్య గొల్ల బేబీ(26) ఆదివారం సాయంకాలం వంట చేయడానికి వెళ్లింది. పొయ్యి పక్కన ఉన్న మొక్కజొన్న పొట్టు తీస్తుండగా అందులో ఉన్న విషపురుగు ఎడమ చేతి చిటికెన వేలుపై కాటు వేసింది. దీంతో బేబీ స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. భర్త మల్లికార్జున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు భర్తతో పాటు కూతురు నందిని, కుమారుడు జశ్వంత్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-అనంతపురం



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి సూచించారు. సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని ఆదిమూర్తినగర్ ఉన్న 9వ బ్రాంచి విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం సమాజంలో రోడ్డు ప్రమాదాలు జరుతున్న విషయం తెలిసిందే అన్నారు. ఇందుకు ప్రధాన కారణం రోడ్డు నిబంధనలు పాటించకపోవడే అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్టులు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంత, జోనల్ కో-ఆర్డినేటర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, డీన్ గంగాధర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి దీప, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి బత్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వైవిఆర్‌కు పరామర్శ

పామిడి : అనారోగ్యంతో బాధపడుతున్న గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డిని సోమవారం హైదరాబాదులోని ఆయన స్వగృహంలో పామిడి మండల కన్వీనర్ నారాయణరెడ్డి కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలపై వెంకటరామిరెడ్డి ఆరాతీసినట్లు నారాయణరెడ్డి తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన కురుబ పెద్ద వన్నక్కకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి కింద మంజూరైన రూ.1,14,882 చెక్కును సోమవారం అనంతపురంలోని మంత్రి స్వగృహంలో మంత్రి సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు అందజేశారు. ఎవరూ అధైర పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సి.ఎర్రిస్వామి, తెలుగు యువత అధ్యక్షులు చల్లా అనంతయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు జె.లింగమూర్తి, కురుబ గోపాలు, కురుబ మహేష్, కురుబ వన్నూరు, కురుబ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాప్‌లో జిల్లా సర్పంచులు

ప్రజాశక్తి-ఉరవకొండ


వర్క్‌షాప్‌నకు వెళ్తున్న సర్పచులు

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో కేంద్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భౌగోళిక అంశాలపై నిర్వంచిన వర్క్‌షాప్‌లో నియోజకవర్గంలోని వజ్రకరూరు సర్పంచి మోనాలిసా, బుక్కరాయసముద్రం మండలం పసులూరు సర్పంచి కల్పన పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు సర్పంచులు పాల్గొనగా వారిద్దరూ జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించాలనే అంశంపై వర్క్‌షాప్‌లో క్షుణ్ణంగా తెలుసుకున్నట్లు తెలిపారు.


నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మృతిచెందిన రామాంజినేయులు

నార్పల : మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామనికి చెందిన నల్లప్ప కుమారుడు కోడూరు రామాంజినేయులు (38) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. నడిమిదొడ్డికి చెందిన రామాంజనేయులు తాగుడుకు బానిసై అనారోగ్యంతో పనులకు వెళ్లకుండా గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో నవంబర్ 8న రాత్రి గడ్డికి కొట్టే క్రిమిసంహారక మందు తాగాడు. గమణించిన బంధువులు నార్పల ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి 13వ తేదీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

అనుమానంతోనే హత్య...


మాట్లాడుతున్న సిఐ రామసుబ్బయ్య

పెద్దపప్పూరు : అనుమానంతోనే మండల పరిధిలోని సింగనగుంటపల్లిలో మహిళను హత్య చేశారని సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సింగనగుంటపల్లి గ్రామానికి చెందిన సునీత (30)ను అదే గ్రామానికి చెందిన ఎంపలాకు చిన్న వీరయ్య తోటకు పనికి వెళ్తూ ఉండేది. ఈనేపథ్యంలో చిన్న వీరయ్యతో చనువుగా ఉన్నట్లు గమణించిన భర్త భార్య సునీతను మందలించారు. అయినా చిన్నవీరయ్యతో తరచూ మాట్లాడుతూ ఉండేది. దీంతో భార్యాభర్తలు గొడవ పడుతూ ఉండేవారు. ఈనేపథ్యంలో సునీతను ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకునాడు. అనుకున్నదే తడువుగా నవంబర్ 21వతేదీన చిన్న వీరయ్య భార్య పద్మావతితో కలిసి తోటలో ఉన్న సునీతను హతమార్చారు. సునీత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు చిన్న వీరయ్య, పద్మావతిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.